## రిజర్వేషన్ పోస్టులు డీ-రిజర్వేషన్!

- వర్సిటీల్లో ఖాళీల భర్తీకి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు లేకుంటే ఓపెన్‌గా మార్పు
- యూజీసీ ప్రతిపాదనపై విమర్శలు
- రిజర్వేషన్లను ఎత్తేసే కుట్ర: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 28: దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ అధ్యాపకుల పోస్టులు ఇప్పటికే చాలా ఖాళీగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్న వేళ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వివాదాస్పద ప్రతిపాదన తీసుకొచ్చింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వ్‌డ్ అధ్యాపకుల పోస్టుల ఖాళీల భర్తీకి అర్హత కలిగిన వ్యక్తులు లేని పక్షంలో ఆ పోస్టులను డీ రిజర్వ్ చేసి ఓపెన్ పోస్టులుగా మార్చాలని ప్రతిపాదించింది. ఈ మేరకు ముసాయిదా ప్రతిపాదనలతో కూడిన ఓ డాక్యుమెంట్‌ను ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేసింది. యూనివర్సిటీలు, ఐఐటీ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్ పోస్టులకు సరైన అభ్యర్థులు లభించటంలేదని సాకు చూపిస్తూ ఉద్దేశపూర్వకంగానే ఆ పోస్టులను ఏండ్ల తరబడి ఖాళీగా ఉంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ సమయంలో యూజీసీ ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

**గ్రూప్ బీ, సీ, డీ పోస్టులు కూడా..**

అత్యవసర సందర్భాల్లో రిజర్వేషన్ పోస్టుకు సరైన అభ్యర్థులు లభించనప్పుడు గ్రూప్ ఏ పోస్టులను అన్‌రిజర్వ్‌డ్‌గా మార్చే విధానం ప్రస్తుతం ఉన్నది. తాజాగా గ్రూప్ బీ, సీ, డీ పోస్టులను కూడా జాబితాలోకి తీసుకురావాలని యూజీసీ ప్రతిపాదించింది. గ్రూప్ ఏ, బీ పోస్టులను డీ రిజర్వేషన్‌లోకి మార్చాలంటే కేంద్ర విద్యాశాఖ అనుమతి తీసుకోవాలని, గ్రూప్ సీ, డీ పోస్టులకయితే యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదిస్తే సరిపోతుందని డ్రాఫ్ట్‌లో పేర్కొన్నారు. యూజీసీ ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. ఈ విధానం అమల్లోకి వస్తే ఉద్దేశపూర్వకంగానే రిజర్వేషన్ అభ్యర్థులు లేరని చెప్పి ఆ పోస్టులను ఓపెన్‌గా మారుస్తారని ఆందోళన వ్యక్తంచేశాయి. యూజీసీ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్ ప్రకటించింది. ఉన్నత విద్యా సంస్థల పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉన్న రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ చేస్తున్న కుట్రలో భాగంగానే యూజీసీ ఈ ప్రతిపాదన చేసిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శించారు.

### పోస్టులు డీ రిజర్వ్ చేయడం ఉండదు: కేంద్రం

యూజీసీ ప్రతిపాదనలపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ ఆదివారం స్పందించింది. రిజర్వేషన్ పోస్టులను డీ రిజర్వ్ చేయడం ఉండదని స్పష్టం చేసింది. 2019లో చేసిన చట్టం ప్రకారం కేంద్ర విద్యా సంస్థల్లో టీచర్ క్యాడర్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో అన్ని పోస్టులకు రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నది. సెంట్రల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్(రిజర్వేషన్ ఇన్ టీచర్స్ క్యాడర్) చట్టం-2019 అమల్లోకి తర్వాత ఏ రిజర్వేషన్ పోస్టును డీ రిజర్వ్ చేయకూడదని, ఈ మేరకు చట్టప్రకారం ఖాళీల భర్తీ చేపట్టాలని ఆదేశాలు జారీచేశామని ఎక్స్ పోస్టులో తెలిపింది. మరోవైపు కేంద్ర విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల పోస్టులను డీ రిజర్వ్ చేయబోమని యూజీసీ వైర్మన్ జగదీశ్ కుమార్ స్పష్టత ఇచ్చారు. రిజర్వ్ క్యాటగిరీలోని బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు ఉన్నత విద్యా సంస్థలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

# సీఎంగా తొమ్మిదోసారి

## ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్‌కుమార్

'ఇండియా'ను వీడి మళ్లీ ఎన్డీయేలో చేరిక

బీజేపీతో కలిసి బీహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు

నితీశ్‌కు డిప్యూటీ సీఎంలుగా ఇద్దరు బీజేపీ నేతలు

ఇప్పుడే ఆట మొదలైందన్న తేజస్వీ యాదవ్

ఈ పొత్తూ మూణ్నాళ్ల ముచ్చటేనని పీకే జోస్యం

పాట్నా, జనవరి 28: బీహార్‌లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న రాజకీయ హైడ్రామాకు తెరపడింది. అనేక నాటకీయ పరిణామాల మధ్య జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఆదివారం ఉదయం తన సీఎం పదవికి రాజీనామా చేస్తూ ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్‌కు, ప్రతిపక్ష ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పారు. అనంతరం బీజేపీతో కలిసి రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ నితీశ్‌తో సీఎంగా ప్రమాణం చేయించారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా డిప్యూటీ సీఎంలుగా.. మరో బీజేపీ నేత ప్రేమ్ చంద్, జేడీయూ సభ్యులు విజయ్ కుమార్, విజేంద్ర యాదవ్, శ్రావణ్ కుమార్ తోపాటు జితిన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హెచ్ఏఎం పార్టీకి చెందిన సంతోష్ కుమార్, స్వతంత్ర ఎమ్మెల్యే సుమిత్ సింగ్‌లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. ఆర్జేడీ ఈ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేయగా.. కాంగ్రెస్ గైర్హాజరయింది. ప్రమాణస్వీకారం అనంతరం నితీశ్ మాట్లాడుతూ.. ఇక ఎన్డీయేని వీడేది లేదన్నారు. అంతకుముందు మహాఘట్‌బంధన్ కూటమిలో తనకు పరిస్థితులు బాగా లేవని, తాను సంతృప్తిగా లేనని పేర్కొంటూ నితీశ్ కుమార్ తన సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. అనంతరం గవర్నర్‌ను కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు.

ప్రమాణ స్వీకారం చేశాక రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న బీహార్ సీఎం నితీశ్ కుమార్

**డిప్యూటీ సీఎంలుగా ఇద్దరు**

డిప్యూటీ సీఎంలుగా బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ప్రమాణ స్వీకారం చేశారు. ఓబీసీ నేత సామ్రాట్ చౌదరి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా గత ఏడాది బాధ్యతలు తీసుకొన్నారు. గతంలో రబ్రీ దేవి ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. 2014లో 13 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపుతో ఆర్జేడీలో చీలికకు ప్రయత్నించారు. ఇక పార్టీ శాసనపక్ష ఉప నేతగా ఎన్నికైన 55 ఏండ్ల విజయ్ సిన్హా.. 2020, నవంబర్-2022, ఆగస్టు మధ్య అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయనకు వ్యతిరేకంగా మహాఘట్‌బంధన్ కూటమి అవిశ్వాస తీర్మానం పెట్టడంతో స్పీకర్ పదవికి రాజీనామా చేశారు. విజయ్ సిన్హా గతంలో మంత్రిగానూ చేశారు.

**సొంతంగా ఎన్నడూ మెజార్టీ సాధించకున్నా..**

నితీశ్ కుమార్ ఓ విధంగా అదృష్టం ఉన్న నేతగా చెప్పొచ్చు. జేడీయూ ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ సొంతంగా మెజార్టీ సాధించనప్పటికీ, కింగ్ మేకర్‌గా నిలిచి సీఎం పీఠాన్ని దక్కించుకొంటూ వస్తున్నారు. కూటములను జంప్ చేసే విషయంలో నితీశ్ పేరును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ బుక్‌లో రాయొచ్చని కాంగ్రెస్ ఎమ్మెల్యే అజీత్ శర్మ ఎద్దేవా చేశారు.

**త్వరలో జేడీయూ కథ ఖతం: తేజస్వీ**

నితీశ్ బీజేపీతో జట్టు కట్టడంపై ఆర్జేడీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. జేడీయూ పార్టీ కథ త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖతం అవుతుందని అన్నారు. ప్రజలు తమ వైపు ఉన్నారని, వారి కోసం నిలబడుతామని పేర్కొన్నారు. 'ఒక్కటి అయితే స్పష్టంగా చెబుతున్నాను. ఆట ఇప్పుడే మొదలైంది. జరుగాల్సింది ఇంకా చాలా ఉన్నది' అని తేజస్వీ వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. మహాకూటమి ప్రభుత్వాన్ని చంపేసి, బీజేపీ పంచన చేరిన నితీశ్‌కు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాగా, చెత్త ఎప్పటికైనా డస్ట్‌బిన్‌లోకే వెళ్తుందంటూ ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఎక్స్‌లో పోస్టు చేశారు.

**ఊసరవెల్లితో పోటీపడుతున్నారు: కాంగ్రెస్**

రంగుల మార్చడంలో నితీశ్ ఊసరవెల్లితో పోటీపడుతున్నారని, మోసం చేయడంలో ఆయన సిద్ధహస్తుడు, నిపుణుడు అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తిని, అతడిని ఆడిస్తున్న వారిని(పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి) బీహార్ ప్రజలు క్షమించబోరని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ ఇలాంటి రాజకీయ డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు. కాగా, సీఎంగా నితీశ్ రాజీనామా చేస్తారనే విషయం తమకు ముందే తెలుసునని, లాలూ, తేజస్వీ ఈ విషయం చెప్పారని, అయితే విపక్ష ఇండియా కూటమి ఐఖ్యతను దృష్టిలో పెట్టుకొని తాము బయటకు ఏమీ చెప్పలేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

**ఏడాది కూడా నిలబడదు:ప్రశాంత్ కిషోర్**

జేడీయూ-బీజేపీ కొత్త పొత్తు వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల వరకు కూడా ఉండదని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కొద్ది నెలలకే ఆ రెండు పార్టీలు మళ్లీ విడిపోతాయని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ.. నితీశ్ కుమార్‌తో తిరిగి జట్టు కట్టిందని, అయితే కమలం పార్టీ ఇందుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. 2022లో కటిఫ్ తర్వాత నితీశ్‌కు తలుపులు మూసుకుపోయాయని పలువురు బీజేపీ నేతలు చేసిన ప్రకటనలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. బెగుసరాయ్‌లో ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడుతూ నితీశ్ జంపింగ్ తనకు ఆశ్చర్యం కలిగించలేదని, ఆయన మహాఘట్‌బంధన్ కూటమితో ఎక్కువ రోజులు ఉండబోరని తాను చెప్తూనే ఉన్నానన్నారు. ఆర్జేడీ చీఫ్ లాలూ హయాంలో కాంగ్రెస్ చేసినట్టుగానే.. ఇప్పుడు బీజేపీ కూడా చేస్తున్నదని విమర్శించారు.

### కూటములు మార్చడంలో దిట్ట!

1951లో జన్మించిన నితీశ్ కుమార్.. బీహార్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యనభ్యసించారు. చదువుకొనే సమయంలో విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనే ఆయన తర్వాత జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. 1985లో హర్నౌత్ స్థానం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2000లో బీజేపీ మద్దతుతో తొలిసారి సీఎం అయిన నితీశ్.. సరిపడా మెజార్టీ లేకపోవడంతో ఏడు రోజులు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. తర్వాత 2005లో బీజేపీతో కలిసి అధికారం చేపట్టారు. 2013లో బీజేపీతో తెగదెంపులు చేసుకొన్నారు. బయటి నుంచి ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని కొనసాగించారు. 2014లో లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఒక్క సంవత్సరంలోనే 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కూటమికట్టి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన నితీశ్ కుమార్ తర్వాత రెండేండ్లకే 2017లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పంచన చేరారు. 2020 అసెంబ్లీ ఎన్నికల తర్వాత మరోసారి సీఎం అయిన ఆయన రెండేండ్ల తర్వాత బీజేపీ తన పార్టీని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ 2022లో ఆర్జేడీ కూటమి వైపు వెళ్లి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరోసారి జంప్ చేసి బీజేపీతో మరోసారి జతకట్టారు.

## హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరే

**లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే పొత్తు: కేజ్రీవాల్**

చండీగఢ్, జనవరి 28: హర్యానా ఎన్నికల్లో పోటీపై ఆమ్ ఆద్మీ పార్టీ తన వైఖరిని వెల్లడించింది. శాసనసభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలోని 90 అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ సొంతంగానే పోటీ చేస్తుందని, లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఇండియా కూటమి పొత్తుతో బరిలోకి దిగుతామని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం స్పష్టం చేశారు. కాగా, సార్వత్రిక ఎన్నికలు ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో జరగనుండగా, అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. కాగా, ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ నేత భగవంత్‌సింగ్ మాన్ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఉద్యోగం లేకున్నా భార్యకు భరణం చెల్లించాల్సిందే

**అలహాబాద్ హైకోర్టు తీర్పు**

లక్నో: భర్తకు ఉద్యోగం ద్వారా ఆదాయం లేకపోయినప్పటికీ, తన భార్యకు భరణం ఇవ్వాల్సిన బాధ్యత ఆ భర్తకు ఉందని అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనం తెలిపింది. మాజీ భార్యకు నెలకు రూ.2,000 చొప్పున భరణాన్ని చెల్లించాలని కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. భార్యకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు ప్రకారం మనోవర్తిని రాబట్టేందుకు భర్తపై అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఈ దంపతులిద్దరికీ 2015లో పెండ్లి జరిగింది. కొంత కాలం తర్వాత, తన భర్త, అతని బంధువులు వరకట్నం డిమాండ్ చేస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. 2016లో భర్త ఇంటిని విడిచిపెట్టారు. ఆమెకు నెలకు రూ.2,000 పోషణ భత్యం చెల్లించాలని కుటుంబ న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఈ తీర్పును భర్త హైకోర్టులో సవాల్ చేశారు. తన భార్య టీచింగ్ ద్వారా నెలకు రూ.10 వేలు సంపాదిస్తున్నదనే విషయాలను పరిగణనలోకి తీసుకోవడంలో ప్రిన్సిపల్ జడ్జి విఫలమయ్యారని ఆరోపించారు. తాను తీవ్ర అస్వస్థతకు గురయ్యానన్నారు.

## 'యూనియన్ ఆఫ్ భారత్'గా పేర్కొన్న సుప్రీంకోర్టు

**న్యాయవాదులకు జారీ చేసిన సర్క్యులర్‌లో ప్రస్తావన**

న్యూఢిల్లీ: యూనియన్ ఆఫ్ ఇండియాకు బదులు 'యూనియన్ ఆఫ్ భారత్'గా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఓ సర్క్యులర్ జారీచేయటం వార్తల్లో నిలిచింది. ఏయే అంశాల్లో వాయిదాలను కోరరాదో తెలియజేస్తూ దేశవ్యాప్తంగా ఉన్న కోర్టులన్నింటికీ సుప్రీంకోర్టు తాజాగా మార్గదర్శకాల్ని విడుదల చేసింది. దీనికి సంబంధించి న్యాయవాదులకు జారీ చేసిన ఓ సర్క్యులర్‌లో 'యూనియన్ ఆఫ్ భారత్'గా సుప్రీంకోర్టు పేర్కొనటం గమనార్హం. గత ఏడాది భారత్‌లో జీ20 దేశాల సదస్సు నిర్వహించగా, జీ20 దేశాధినేతల విందు కార్యక్రమానికి కేంద్రం పంపిన ఆహ్వానంలో భారత రాష్ట్రపతిని 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్'గా మోదీ సర్కార్ పేర్కొనటం అప్పట్లో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దేశం పేరు.. ఇండియా నుంచి భారత్‌కు మార్చనున్నట్టు ఊహాగానాలు వెలువడ్డాయి. అయితే రెండు పదాల్ని కూడా వాడొచ్చునని కొంతమంది న్యాయ నిపుణులు కేంద్ర చర్యల్ని సమర్థించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-1ను ప్రస్తావిస్తూ, 'ఇండియా, భారత్ రెండూ ఒకటేనని గుర్తుచేశారు.

## ఫిరాయింపుల నిరోధక చట్టం సమీక్షకు కమిటీ

**వెల్లడించిన స్పీకర్ ఓం బిర్లా**

ముంబై, జనవరి 28: ఫిరాయింపుల నిరోధక చట్టంపై సమీక్షకు మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం ప్రకటించారు. ఆల్ ఇండియా ప్రిసైడింగ్ అధికారుల 84వ వార్షిక సమావేశంలో ఆయన ఇటీవల దేశంలోని కొన్ని రాష్ట్రాలలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను ప్రస్తావించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పొందుపరిచిన ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వేరొక పార్టీలోకి చేరినా, లేదా సొంత పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేసినా తమ పదవికి అనర్హులవుతారు. అయితే ఒక పార్టీకి చెందిన వారిలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం అయితే వారిపై అనర్హత వేటు పడదు.

# బాలికలను చిదిమేస్తున్నారు!

**చిన్నారులపై 96% పెరిగిన రేప్ కేసులు • 2016-22 మధ్య అత్యధిక ఘటనలు**

న్యూఢిల్లీ, జనవరి 28: దేశవ్యాప్తంగా బాలికలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయి. 2016-22 మధ్య ఈ ఘటనలు 96 శాతం పెరిగాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్సీఆర్బీ) డాటాను విశ్లేషించిన చైల్డ్ రైట్స్ అండ్ యూ (సీఆర్‌వై) స్వచ్ఛంద సంస్థ ఈ విషయాన్ని తాజాగా వెల్లడించింది. ప్రజల్లో చైతన్యం రావడం, సాంకేతికత పెరగడం, ఫిర్యాదులు సులభతరం కావడం వల్ల బాలికలపై లైంగికదాడి కేసులు అధికంగా నమోదైనట్టు సీఆర్ఐ సంస్థ డైరెక్టర్ సుభేందు భట్టాచార్జి తెలిపారు. 2021-22 మధ్యకాలంలో ఇలాంటి కేసుల పెరుగుదల 6.9 శాతంగా ఉండగా, 2016-22 సంవత్సరాల మధ్య పెరుగుదల 96.8 శాతం ఉన్నట్టు పేర్కొన్నారు.




# వాయిదాల సంస్కృతి పోవాలి

- దేశ న్యాయ వ్యవస్థలో ప్రొఫెషనలిజం రావాలి
- సుప్రీంకోర్టు వజ్రోత్సవాల్లో సీజేఐ డీవై చంద్రచూడ్
- ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్ష

సుప్రీంకోర్టు వజ్రోత్సవాల్లో మాట్లాడుతున్న సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ, జనవరి 28: న్యాయ వ్యవస్థలో వాయిదాల సంస్కృతి పోయి.. వృత్తి నైపుణ్యంతో (ప్రొఫెషనలిజం) కూడిన సంస్కృతి రావాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. సంస్థాగత మార్పులపై చర్చలు జరగాల్సిన అవసరముందన్నారు. భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన వేళ, సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. కోర్టుల పనితీరు, విచారణ ప్రాచీన పద్ధతుల్లో ఉండటం.. మొదలైనవి సవాళ్లుగా గుర్తించామని, వీటిపై చర్చిస్తున్నామని ఆయన తెలిపారు. దీని కంటే ముందు సుప్రీంకోర్టు వజ్రోత్సవ వేడుకలు ప్రధాని మోదీ చేతులమీదుగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కొత్త వెబ్‌సైట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. దీంతో దేశ పౌరులకు సుప్రీంకోర్టు డిజిటల్ నివేదికలు, తీర్పులు అందుబాటులోకి రానున్నాయి. 1950 జనవరి 26 నుంచి భారత రాజ్యాంగం అమల్లోకి రాగా, అదే ఏడాది జనవరి 28 నుంచి దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రారంభమైంది. అప్పట్నుంచి దేశంలో ప్రాథమిక హక్కులను కాపాడటంలో సుప్రీం కీలకపాత్ర పోషిస్తున్నది. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చట్టాలను సైతం సుప్రీంకోర్టు సమీక్షిస్తున్న సంగతి తెలిసిందే.

**ఈజ్ ఆఫ్ జస్టిస్ పౌరుల హక్కు: ప్రధాని మోదీ**

దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కొత్త చట్టాలు చేస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్.. మాదిరి ఈజ్ ఆఫ్ జస్టిస్ (సులభతర న్యాయం) అన్నది ఈ దేశానికి చాలా అవసరమని ప్రధాని అన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ పొందటం దేశంలోని ప్రతి పౌరుడి హక్కుగా ప్రధాని పేర్కొన్నారు. 'భారత ప్రజాస్వామ్యాన్ని సుప్రీంకోర్టు బలోపేతం చేసింది. సామాజికంగా, రాజకీయంగా దేశానికి కొత్త దిశా నిర్దేశం చేసింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త చట్టాలు చేస్తున్నాం' అని అన్నారు. సుప్రీంకోర్టు భవనాన్ని మరింత విస్తరించేందుకు గాను రూ.800 కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు.

### పెరిగిన మహిళల ప్రాతినిధ్యం

సుప్రీంకోర్టు వజ్రోత్సవ వేడుకల్ని పురస్కరించుకొని న్యాయవ్యవస్థలోని సమస్యలు, సవాళ్లను సీజేఐ ప్రస్తావించారు. 'న్యాయ వృత్తిలో సమాజంలోని భిన్నవర్గాల ప్రాతినిధ్యం పెరగాలి. బార్, బెంచ్‌లలో ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. సమాజంలోని అణగారిన వర్గాల చేరికపై దృష్టిపెట్టాలి. జిల్లా కోర్టుల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య 36.3శాతముంది' అని అన్నారు. జడ్జీలు తమ విధుల్ని నిర్వర్తించటంలో వ్యక్తిగతంగానూ స్వతంత్రతను కలిగివుండటం చాలా ముఖ్యమని సీజేఐ పేర్కొన్నారు. వారిపై సామాజికంగా, రాజకీయంగానూ ఒత్తిడి ఉండరాదన్నారు. సరైన సమయానికి తీర్పులు వెలువరించి న్యాయవ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుపై ఉందన్నారు.

## 5 నిమిషాల్లోనే చార్జ్ అయ్యే ఈవీ బ్యాటరీ

**కార్నెల్ పరిశోధకుల బృందం అభివృద్ధి**



న్యూయార్క్: పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాలతో నడిచే వాహనాల స్థానంలో క్రమంగా ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీలను) అందుబాటులోకి తెస్తున్నాయి. కానీ, బ్యాటరీల చార్జింగ్‌కు చాలా సమయం పడుతుండటం ఈవీల వినియోగానికి ప్రధాన అవరోధంగా పరిణమిస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అమెరికాలోని కార్నెల్ ఇంజినీరింగ్ విద్యాసంస్థ ప్రొఫెసర్ లిండెన్ ఆర్చర్ నేతృత్వంలోని పరిశోధక బృందం సరికొత్త లిథియం బ్యాటరీని అభివృద్ధి చేసింది. కేవలం 5 నిమిషాల్లోపే చార్జ్ కావడం దీని ప్రత్యేకత. ఈ బ్యాటరీ అందుబాటులోకి వస్తే ఈవీల చార్జింగ్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అగత్యం తప్పడంతోపాటు విద్యుత్తు వాహనాల వినియోగం ఊపందుకుంటుంది. వాస్తవానికి విద్యుత్తు వాహన రంగంలో సాంకేతికత ఇప్పటికే కొంత మేరకు అభివృద్ధి చెందింది. దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వేగవంతమైన వాణిజ్య చార్జర్ సాయంతో ఒక ఈవీని చార్జ్ చేసేందుకు దాదాపు 30 నిమిషాల సమయం పడుతున్నది. ఇది ఇండ్లలో వాడే సాధారణ చార్జర్ కంటే చాలా మెరుగైనదే అయినప్పటికీ ఈవీల వినియోగాన్ని పెంచేందుకు మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉన్నది. ఒక ఈవీ బ్యాటరీని మనం కేవలం 5 నిమిషాల్లో చార్జ్ చేసుకోగలిగితే 300 మైళ్ల దూరం ప్రయాణించేందుకు అవసరమైన భారీ బ్యాటరీని కలిగి ఉండాల్సిన అవసరం లేకుండా తక్కువ ధరకు లభ్యమయ్యే బ్యాటరీతోనే సరిపెట్టుకోవచ్చని, దీంతో విద్యుత్తు వాహనాల ధరలు తగ్గి వినియోగం కూడా పెరుగుతుందని ఆర్చర్ వివరించారు.

# ఇరాన్‌లో 9 మంది పాకిస్థానీల కాల్చివేత

- కాల్చిచంపిన దుండగులు
- సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పాకిస్థాన్ డిమాండ్
- ఇరు దేశాల మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు

ఇస్లామాబాద్/ట్రెహాన్: ఇరాన్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఇరాన్ సరిహద్దు ప్రాంతంలో పని చేస్తున్న తొమ్మిది మంది పాకిస్థానీలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం కాల్చిచంపారు. కల్లోలిత ప్రాంతమైన ఇరాన్ ఆగ